క్లుప్తంగా

డిప్యూటీ సీఎంకు స్వాగతం



డిప్యూటీ సీఎం అంజాద్ బాషాను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

తలుపుల: మండలంలోని రెక్కమాను క్రాస్ వద్ద రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషాను శుక్రవారం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎంను శాలువా, పూలమాలతో సత్కరించారు. మండల కేంద్రంలో నిరుపేద ముస్లింల వివాహాలకు నిర్మించిన షాదీమహల్ వినియోగంలో లేక పాడుబడిందన్నారు. నూతన షాదీమహల్ మంజూరు చేయించాలని కోరారు. ఇందుకు డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రఫీనాయక్, సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జి డీకే బాబు (కృష్ణారెడ్డి), మాజీ సర్పంచ్ పయాజ్ అహమ్మద్, ప్రభు, మౌలా పాల్గొన్నారు.

దుర్గమ్మ దేవతకు పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, సుప్రియ దంపతులు

ధర్మవరం రూరల్: పట్టణంలోని దుర్గమ్మ దేవతకు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి సుప్రియ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మొదటి శ్రావణ శుక్రవారం కావడంతో అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 9న లోక్ అదాలత్

ధర్మవరం రూరల్: పట్టణంలోని కోర్టు ఆవరణలో సెప్టెంబర్ 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి ఎ.గీతావాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని రాజీకి అవకాశం ఉన్న సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.

జోరుగా ప్రచారం



తంబాపురంలో వార్డు అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేస్తున్న నాయకులు

బత్తలపల్లి: మండలంలోని తంబాపురం పంచాయతీ పరిధిలోని 3వ వార్డుకు వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న లక్ష్మీనారాయణమ్మను గెలిపించాలని సర్పంచు సానే జయచంద్రారెడ్డి, గ్రామ నాయకులు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. గౌను గుర్తుకు ఓటు వేసి మంచి మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో అభ్యర్థిని లక్ష్మీనారాయణమ్మ, ఉప సర్పంచ్ బీదాల ప్రతాప్‌రెడ్డితో పాటు గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కదిరి: స్థానిక ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ భవనంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.వి.శివారెడ్డి, పి.ఆత్మారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుంచి ప్రముఖ మెడివిజన్ ఆసుపత్రి వైద్యులు హాజరై కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కంటి పరీక్షల అనంతరం ఆపరేషన్ అవసరమైన వారికి ఆసుపత్రి వారే హైదరాబాద్‌కు ఉచితంగా తీసుకెళ్లి ఆపరేషన్లు చేయిస్తారన్నారు. అనంతరం వారే ప్రత్యేక వాహనంలో కదిరికి చేరుస్తారని తెలిపారు. కంటి పరీక్షల నిమిత్తం హాజరయ్యే వారందరూ తప్పకుండా తమ వెంట హెల్త్‌కార్డు, ఆధార్‌కార్డు తీసుకుని రావాలని సూచించారు.

ఈ-క్రాప్ చేయించుకుంటేనే నష్టపరిహారం



రెడ్డివారిపల్లి వద్ద ఈ-క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న ఏఓ వెంకటరమణాచారి

అమడగూరు: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులంతా తప్పకుండా ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకుంటేనే నష్టపరిహారం అందుతుందని వ్యవసాయాధికారి వెంకటరమణాచారి తెలిపారు. శుక్రవారం తుమ్మల గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఈ-క్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ.. ఈ-క్రాప్ చేయించుకుంటేనే వాతావరణ బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నావడ్డీ, పంట రుణాలు, కనీస మద్దతు ధర, తదితర ప్రభుత్వ పరిహారాలకు అర్హులవుతారన్నారు. రైతులంతా సంబంధిత ఆర్బీకేలకు వెళ్లి వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలన్నారు. సర్వే నంబర్లను నమోదు చేయించుకుని ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు.

శివారు కాలనీల అభివృద్ధికి చర్యలు

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం రూరల్: పట్టణ శివారు కాలనీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 26వ వార్డులో అధికారులతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వార్డులో పర్యటిస్తూ ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మొదట డ్రైనేజీలను ఏర్పాటు చేయించి తర్వాత సీసీ రోడ్లను వేయించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా వార్డులో మౌలిక వసతులు కల్పించి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని అధికారులకు సూచించారు. అర్హులందరికీ నేతన్న నేస్తం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. పేద ప్రజల సంక్షేమానికి మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. అర్హత ఉన్న వారందరికి ఇళ్ల పట్టాలతో పాటు ఇళ్లను నిర్మించడం జరుగుతోందన్నారు. ఇళ్లు లేని వారు ఎవరూ ఉండకూడదన్నారు. ఇంకా ఎవరైనా అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు ఉంటే అలాంటి వారు సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చారన్నారు. కులమతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, వార్డు కౌన్సిలర్ రాయపాటి మంజుల, వార్డు ఇన్‌చార్జ్ రాయపాటి రామకృష్ణ, 40 వార్డులకు చెందిన కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికలకు సర్వం సిద్ధం



బత్తలపల్లి: పోలింగ్ సామగ్రితో తంబాపురం వెళ్తున్న ఎన్నికల సిబ్బంది, పోలీసులు



అమడగూరు: అమడగూరులో పోలింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

బత్తలపల్లి: తంబాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని 3వ వార్డు ఉప ఎన్నికకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి దివాకర్ తెలిపారు. 3వ వార్డులో మొత్తం 128 ఓట్లు ఉండగా.. అందులో స్త్రీలు 66, పురుషులు 62 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు ముగ్గురు అధికారులను నియమించడం జరిగిందన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ధర్మవరం రూరల్ సీఐ ఆరోహణరావు ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ ఎస్ఐ ప్రదీప్ కుమార్ పర్యవేక్షణలో ఏఎస్ఐ సోమశేఖర్‌మూర్తి, నలుగురు కానిస్టేబుల్స్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. పోలింగ్ సామగ్రి, బ్యాలెట్ పేపర్లను పోలింగ్ కేంద్రానికి తరలించారు. పోలింగ్ కేంద్రానికి ఓటు ఉన్నవారు మాత్రమే రావాలని సూచించారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఇతర ప్రాంతాల నుంచి ఎవ్వరు వచ్చినా అనుమతించేది లేదని స్పష్టం చేశారు.

అమడగూరు: మండలంలోని చినగానిపల్లి పంచాయతీలో 11వ వార్డు, అమడగూరు పంచాయతీలోని 3వ వార్డుకు శనివారం ఉప ఎన్నిక జరగనుంది. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు అవసరమయ్యే సామగ్రి సమకూర్చినట్లు ఎంపీడీఓ మునెప్ప తెలిపారు. పోలింగ్ అధికారులు సైతం ఆయా గ్రామాలకు చేరుకున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం వరకూ పోలింగ్ తర్వాత కౌంటింగ్ నిర్వహించి సాయంత్రానికే విజేతలను ప్రకటించడం జరుగుతుందన్నారు.

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం క్రిష్టాపురం పంచాయతీలోని 7వ వార్డుకు శనివారం ఉప ఎన్నికలు జరుగుతాయని ఎంపీడీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఇప్పటికే పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ మేరకు పోలింగ్, కౌంటింగ్ అనంతరం విజేతలను ప్రకటిస్తామన్నారు. రిటర్నింగ్ అధికారిగా ఇందిరా బాల, ఎన్నికల నిర్వహణాధికారిగా ఎంఈఓ గోపాల్‌నాయక్‌ను నియమించినట్లు తెలిపారు.

తలుపుల: మండలంలోని ఉడమలకుర్తి గ్రామంలో 4వ వార్డుకు శనివారం పోలింగ్ జరగనుందతి. పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్ఓ శకుంతల తెలిపారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రెండ్రోజుల్లో ఓటరు సర్వే పూర్తి చేయాలి



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి భాగ్యరేఖ

అమడగూరు: రెండు రోజుల్లో ఓటరు జాబితా సర్వేను పూర్తి చేయాలని పుట్టపర్తి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భాగ్యరేఖ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె ఓడీ చెరువు మండలంలోని రెవెన్యూ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ నిర్దేశించిన మేరకు ఈనెల 21వ తేదీలోపు ఓటరు జాబితాను ఇంటింటికీ తిరిగి పూర్తి చేయాలన్నారు. కుటుంబంలోని అందరి ఓటరు కార్డులను పరిశీలించి కుటుంబ సభ్యుల అనుమతితో తప్పులను సరి చేయాలన్నారు. అలాగే ఈ ఏడాది డిసెంబర్ 31 నాటికి పూర్తిగా 18 ఏళ్లు నిండే వారికి కొత్తగా ఓటరు కార్డులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్తులు ఓటరు కార్డులో తప్పులు సరి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామనాథరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



తలుపుల: ఎస్ఐ మగ్బుల్‌బాషాను సన్మానిస్తున్న నాయకులు



నల్లచెరువు: ఎంపీడీఓ శకుంతలను సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

నల్లచెరువు: స్వాతంత్య్ర వేడుకల్లో జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు చేతుల మీదుగా ఉత్తమ మండల అభివృద్ధి అధికారిణిగా అవార్డు అందుకున్న ఎంపీడీఓ శకుంతల, ఎం అగ్రహారం వెల్ఫేర్ అసిస్టెంట్ శివశంకర్ నాయక్‌ను శుక్రవారం పలువురు ప్రజాప్రతినిధులు సన్మానించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, సర్పంచ్ పంచరత్నమ్మ, వైస్ ఎంపీపీ నారాయణ స్వామి, ఎంపీటీసీ లక్ష్మీదేవి, ఏఓ రామకృష్ణ, ఎంఈఓ తిరుపాల్ నాయక్ పాల్గొన్నారు.

తలుపుల: స్వాతంత్య్ర వేడుకల్లో ఉత్తమ ఎస్ఐగా అవార్డు పొందిన ఎస్ఐ మగ్బుల్‌బాషాను స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులు, జర్నలిస్టులు సన్మానించారు. అధికారులు నిజాయతీగా విధులు నిర్వర్తించినప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రఫీనాయక్, మాజీ సర్పంచులు సూర్యనారాయణరెడ్డి, పయాజ్ అహమ్మద్, సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జి డీకేబాబు (కృష్ణారెడ్డి), సర్పంచులు, నాయకులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రావణ మాస ఉత్సవాలు

నల్లచెరువు: మండల పరిధిలోని పాలపాటి దిన్నె ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం నుంచి శ్రావణమాస ఉత్సవాలు నిర్వహించనున్నట్లు టెంపుల్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఆర్టీసీ అధికారుల సహకారంతో బస్సు సౌకర్యం కల్పించామన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

తాడిమర్రి: పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరి చేరవని ఏఎన్‌ఎంలు గ్రామస్తులకు సూచించారు. డ్రైడే, ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా తాడిమర్రి, పెద్దకోట్ల, నార్సింపల్లి, పిన్నదరి, కునుకుంట్ల, దాడితోట, ఎం.అగ్రహారం, చిల్లవారిపల్లి, చిన్నచిగుళ్లరేవు తదితర గ్రామాల్లో వైద్య సిబ్బంది పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ తిరుగుతూ నీటి తొట్టెలను శుభ్రం చేయించారు. అలాగే మురుగునీటి గుంతలను గుర్తించి వేస్టాయిల్ ఉండలు వేయించారు. అలాగే వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అనంతరం పరిసరాల శుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు జానకీరామ్, హర్షవర్ధన్ రెడ్డి, వెంకట్రాముడు, ఏఎన్‌ఎంలు కృష్ణమ్మ, కోమలి, లక్ష్మీకాంతమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గణిత అధ్యాపకుడి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కదిరి అర్బన్: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గణిత అధ్యాపకుడి పోస్టుకు అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ దామోదర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తులను కళాశాలలో అందజేయాలన్నారు. ఈనెల 21వ తేదీన ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకుని రావాలని సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతి చెందిన నగేంద్ర షా

నల్లచెరువు: అల్లుగుండు రైల్వే ఫ్లైఓవర్ వద్ద ఈనెల 17వ తేదీన లారీ, మినీ ఐచర్ ఢీకొన్న ఘటనలో బీహార్‌కు చెందిన హోరిల్ యాదవ్ (24) మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నగేంద్ర షా (45)ను అత్యవసర చికిత్స నిమిత్తం సహచరులు కర్నూలు సర్వజనాస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం నరేంద్ర షా మృతి చెందినట్లు ఏఎస్ఐ షేక్షావలి తెలిపారు.

నేడు వసతి భవనాల ప్రారంభోత్సవం

నల్లచెరువు: మండల పరిధిలోని పాలపాటి దిన్నె ఆంజనేయ స్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన వసతి భవనాలను శనివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ప్రారంభిస్తారని ఆలయ చైర్మన్ దేవరింటి భాస్కర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఏటా నిర్వహించే శ్రావణమాస ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు.

బాధితుడికి నష్ట పరిహారం అందించాలి



నరికేసిన చీనీ చెట్లను పరిశీలిస్తున్న విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి కృష్ణయ్య

తాడిమర్రి: చీనీ చెట్లు నరికి వేయడంతో నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని విశ్రాంతి ప్రధాన న్యాయమూర్తి కృష్ణయ్య కోరారు. మండలంలోని మర్రిమాకులపల్లిలో మల్లాగుండ్ల చిన్న గంగన్న చీనీ తోటలో ఇటీవల దుండగులు చీనీ చెట్లను నరికేశారు. విషయం తెలుసుకున్న విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి కృష్ణయ్య శుక్రవారం గ్రామానికి వెళ్లి బాధిత రైతును పరామర్శించారు. జరిగిన సంఘటనపై ఆరా తీశారు. ఇటీవల వ్యక్తిగత, రాజకీయ కక్షలతో దుండగులు చీనీచెట్లను నరికి వేస్తున్నారన్నారు. ఇలాంటి వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపాలన్నారు. ఇలాంటి వారిని శిక్షించడానికి ప్రత్యేక చట్టం తేవాలన్నారు. అంతేకాక దుండగులతోనే బాధిత రైతుకు నష్ట పరిహారం కట్టించుకునేలా చట్టం తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు కొంకా నాగార్జున, ప్రసాద్, పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక



ఆదిత్య



కీర్తి చరణ్

మడకశిరరూరల్: పట్టణానికి చెందిన ఫుట్‌బాల్ క్రీడకారులు ఆదిత్య, కీర్తి చరణ్ శ్రీసత్యసాయి జిల్లా సబ్ జూనియర్ అండర్–19 బాలుర జట్టుకు ఎంపికైనట్లు శుక్రవారం ఫుట్‌బాల్ క్లబ్ నిర్వహకులు తెలిపారు. హిందూపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల ఎంపికలో వీరు మంచి ప్రతిభ కనపరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరు ఆర్డీటీ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నారని క్లబ్ సభ్యులు నవీద్, మోహన్, రవిశంకర్, నాగభూషణం, బాలాజీ తెలిపారు.

రిమాండ్‌కు సచివాలయ ఉద్యోగి

పెనుకొండ రూరల్: మండలంలోని మరువపల్లి గ్రామానికి చెందిన అఖిల గత నెలలో సచివాలయ ఉద్యోగి గోవర్ధన్ ప్రేమ పేరుతో మోసం చేశాడంటూ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఇదే గ్రామానికి చెందిన సచివాలయ ఉద్యోగి గోవర్ధన్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు శుక్రవారం విచారించారు. అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

హుండీ కానుకల లెక్కింపు



హుండీలో కానుకలను లెక్కిస్తున్న అధికారులు, గ్రామ పెద్దలు

లేపాక్షి: స్థానిక వీరభద్రస్వామి దేవాలయంలో శుక్రవారం ఉదయం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ నరసింహరాజు, ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి పర్యవేక్షణలో హుండీలో కానుకలను లెక్కించారు. 81 రోజులకుగానూ రూ.1,88,988 ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు రామచంద్రరావు, రామాంజనేయులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

రామగిరి: మండలంలోని నసనకోట సమీపంలోని ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఆది, మంగళ, శుక్రవారాల్లో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో అమ్మ వారికి పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి



డిప్యూటీ సీఎం అంజాద్ బాషాకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని దళిత సంఘం నాయకులు కోరారు. శుక్రవారం తిమ్మమ్మమర్రిమాను పర్యటనకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విగ్రహ ఏర్పాటుకు స్థలంతో పాటు కమ్యూనిటీ భవనం నిర్మించుకునేందుకు స్థలం కేటాయించాలని కోరారు. చుట్టుపక్కల గ్రామాల్లో దళితులు శుభకార్యాలు జరుపుకోవాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జయరాం, వేమన్న, ఆదెన్న, రామాంజులు, చిన్న ఇరగప్ప, శేషాద్రి పాల్గొన్నారు.

పంచలోహ విగ్రహాల అందజేత



పావగడ: శ్రావణ మాసోత్సవాలను పురస్కరించుకుని స్థానిక శనీశ్వరాలయంలో కొలువుదీరిన శనీశ్వరస్వామి, జ్యేష్ఠాదేవి పంచలోహ విగ్రహాలను ఆలయ సమితి పదాధికారులు శుక్రవారం ఆలయానికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సమితి అధ్యక్షుడు ఆనందరావు, కార్యదర్శి సుబ్బనరసింహ, మాజీ అధ్యక్షుడు కేవీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పిల్లలతో కలసి తల్లి అదృశ్యం



ఇద్దరు పిల్లలతో శైలజా దేవి (ఫైల్)

పెనుకొండ రూరల్: ఇద్దరు పిల్లలతో కలసి ఓ మహిళ గురువారం అదృశ్యం అయింది. వివరాలు.. మునిమడుగు గ్రామానికి చెందిన వడ్డి శైలజా దేవి భర్త రవితో గురువారం ఉదయం గొడవపడింది. తన పిల్లలు జయకృష్ణ, వియాన్‌తేజతో కలసి హిందూపురం మండలంలోని ఎం.బీరేపల్లికి వెళ్తున్నట్లు భర్తకు చెప్పి ఆటోలో బయలు దేరింది. అయితే శుక్రవారం కూడా పుట్టినింటికి చేరలేదు. కుటుంబ సభ్యులు, బంధువులను విచారించిన ఆచూకీ లభించలేదు. శుక్రవారం సాయంత్రం వడ్డి శైలజా దేవి అదృశ్యమైనట్లు తండ్రి శ్రీరాములు కియా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ హుస్సేన్ తెలిపారు.

ఆకట్టుకున్న సీతాకోకచిలుక



పుట్టపర్తి అర్బన్: రెండు కళ్ల లాంటి ఆకారాలు, పలు రంగులతో ఉన్న సీతాకోకచిలుక అందరినీ ఆకట్టుకుంది. శుక్రవారం పుట్టపర్తి మండలం పెడపల్లిలో సంచరిస్తున్న వింత సీతాకోక చిలుకను పలువురు ఆసక్తిగా తిలకించారు. సుమారు గంట పాటు ఉన్న సీతాకోకచిలుక అనంతరం ఎగిరిపోయింది.

ఆరోగ్యశ్రీ సేవలు పెంచుదాం



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఆరోగ్యశ్రీ కింద ఎక్కువమంది రోగులకు సేవలందించేలా చర్యలు తీసుకోవాలని విభాగాధిపతులకు సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు సూచించారు. శుక్రవారం ఏపీజీడీఏ హాలులో హెచ్ఓడీలతో ఆయన సమావేశమయ్యారు. ఆరోగ్యశ్రీ కేసులు పెంచేందుకు హెచ్ఓడీల విజ్ఞప్తులను తీసుకుని, కేసుల పురోగతికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూపరింటెండెంట్ సలహాలందజేశారు. ఆరోగ్యశ్రీ కేసులు పెంచడం ద్వారా ఆస్పత్రికి ఆదాయం సమకూరుతుందని, తద్వారా వివిధ విభాగాలనభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ప్రాణాపాయ కేసులకు తక్షణ వైద్య సేవలందించాలన్నారు. ముఖ్యంగా ‘ఈ– హాస్పిటల్’ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమష్టిగా పని చేసి సర్వజనాస్పత్రిని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేయాలని హెచ్ఓడీలను ఆదేశించారు. సమావేశంలో ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, హెచ్ఓడీలు డాక్టర్ రామస్వామినాయక్, డాక్టర్ రామస్వామి, డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ శంషాద్‌బేగం, డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ ఆత్మారాం, డాక్టర్ భాస్కర్, ఏడీలు డాక్టర్ శ్రీనివాస్‌శౌరి, డాక్టర్ సౌజన్య కుమార్, కార్డియాలజిస్టు డాక్టర్ సుభాష్‌చంద్రబోస్, న్యూరోసర్జన్ డాక్టర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

హైవే రెస్టారెంట్లపై కేసు నమోదు



రెస్టారెంట్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం క్రైం: హైవే వెంబడి ఉన్న పలు రెస్టారెంట్లు నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో కేసు నమోదు చేశారు. జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఫుడ్ సేఫ్టీ అధికారి కళ్యాణ్ చక్రవర్తి నేతృత్వంలో ఫుడ్ సేఫ్టీ అధికారి తస్లీం, ఎంహెచ్ఓ గంగాధర్ రెడ్డి, వైద్యులు మనోజ్ బృందం శుక్రవారం రుద్రంపేట వద్ద బెంగళూరు హైవేకు ఆనుకుని ఉన్న పలు రెస్టారెంట్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. శుచి, శుభ్రత పాటించని ‘గార్లిక్’ రెస్టారెంట్‌కు ఇంప్రూవ్‌మెంట్ నోటీసు జారీ చేశారు. ‘ద వింటేజ్ రెస్టారెంట్’లో కాలం చెల్లిన ఎంసీ కైన్ క్రిస్పీ పొటాటో ప్యాక్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కేఎఫ్‌సీ రెస్టారెంట్‌లో నల్లగా మారిన వంట నూనెను గుర్తించారు. వంట నూనెను పదేపదే వాడరాదని సూచించారు. ఎక్సోటికా రెస్టారెంట్‌ను పరిశీలించి శుభ్రత, ఆహార పదార్థాల నాణ్యతపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రజారోగ్యంతో ఆటలాడితే ఉపేక్షించేది లేదని రెస్టారెంట్ నిర్వాహకులకు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కళ్యాణ్‌చక్రవర్తి హెచ్చరించారు.